క్లుప్తంగా

వినికిడి యంత్రాల పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవనంలో లోడి సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చాయ్, విగార్డ్ సంస్థల సౌజన్యంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు సంస్థ డైరెక్టర్ విజయ్‌పాల్ రెడ్డి వినికిడి యంత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాయ్ సంస్థల నిర్వాహకులు సోమశేఖర్, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

కమీషన్ లేకుండా డబ్బులు చెల్లించాలి

కేసముద్రం: మిర్చి రైతులకు ఎలాంటి కమీషన్ లేకుండా మార్కెట్‌లో ఖరీదు చేసిన రోజునే డబ్బులు చెల్లించాలని స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి ఖరీదు చేసిన వ్యాపారులు క్యాష్ కటింగ్, కమీషన్ లేకుండా రైతులకు చెక్ ద్వారా లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లింపులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజా, వ్యాపారులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్'లో ప్రతిభ

కురవి: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వేదవ్యాస్, హర్షవర్ధన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బానోత్ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు.
డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు జి.నిఖిత, సీహెచ్ జస్వంత్, జె.అనిల్‌కుమార్ ఎన్‌ఎంఎంఎస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు.

కనీస వేతనాలు చెల్లించాలి

నెహ్రూసెంటర్: పశువులకు వైద్య సేవలను అందిస్తున్న పశుమిత్రలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉపేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 17న డీఆర్‌డీఏ కార్యాలయం, 20 కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి శారద, ఝాన్సీ, అనూష, రమ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై శిక్షణ

డోర్నకల్: మండలంలోని చాప్లాతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవానం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ అపర్ణ మాట్లాడుతూ.. చాప్లాతండాలో మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు పారిశుద్ధ్య పనుల నిర్వహన బాగుందంటూ అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండునాయక్, ఉపసర్పంచ్ మోహన్, కోఆర్డినేటర్లు రవికుమార్, శ్రవన్, ఎంపీఓ మున్వర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కురవి: సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా జీపీ పరిధిలోని తునికి చెట్టు తండాలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు నెహ్రూనాయక్ మంగళవారం రూ.50వేల విరాళం అందజేశాడు. మండలంలోని కందికొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన రమేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం, అలాగే మోద్గులగూడెం గ్రామంలో మహిళా కళాకారులకు రూ.15వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

నాయకుల ఫిర్యాదు

తొర్రూరు/దంతాలపల్లి: నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సతీమణిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సోమయ్య అర్బన్ అధ్యక్షుడు కుమార్, నాయకులు రాములు, రాజు పాల్గొన్నారు.

గ్రామ సందర్శన

దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామాన్ని మండల పంచాయతీ అధికారి అప్సర్ పాషా మంగళవారం సందర్శించాడు. ఈసందర్భంగా గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ నాగిరెడ్డి వసంతతో మాట్లాడారు.

చిరుధాన్యాల్లో పౌష్టిక విలువలు

మరిపెడ రూరల్: చిరుధాన్యాలతోనే సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని గిరిపురం సర్పంచ్ పెద్ద బోయిన జనార్దన్ అన్నారు. మరిపెడ మండలం గిరిపురం గ్రామ పంచాయతీ పరిధిల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023, మహిళ, శిశు మాసోత్సవాలను మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాణి, ఉపసర్పంచ్ సమలత, పాఠశాల హెచ్‌ం పరిపూర్ణేశ్వరి, లింగయ్య పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

గూడూరు: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, వాటి ప్రాముఖ్యతను తెల్సుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీడీపీఓ నీలోఫర్ అజ్మీ అన్నారు. మండలంలోని బొద్దుగొండ రైతు వేదికలో మంగళవారం అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం, జిల్లా శిశు మాసోత్సవాలను సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిత, పోషణ అభియాన్ ప్రతినిధి చైతన్య, డీసీపీయూ వీరన్న, అంగన్‌వాడీ టీచర్లు భారతి, కనకదుర్గ భవాని, మంగ, పూలమ్మ, రాధ, ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: సీమంతం జరిపిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పెద్దవంగర: మనం తీసుకొనే రోజువారి ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవడం వలన ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని సర్పంచ్ ధరావత్ రాజేందర్ అన్నారు. మండలంలోని పడమటి తండా పరధిలోని జయరాం తండా, పోచంపల్లిలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత సమక్షంలో మానుకోట మహిళ శిశు మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయ, జీపీ కార్యదర్శి పావని, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: మాట్లాడుతున్న సీడీపీఓ నీలోఫర్ అజ్మీ



పెద్దవంగర: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

● మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: నిరుపేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ అని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రూ.50లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 71 మంది లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీలో వర్తించిన వ్యాధుల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ అన్నారు. దేశంలో ఎక్కడ లేని పథకాలను కేసీఆర్ రాష్ట్రంలో ప్రవేశపట్టారని అవి ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బిందు , జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి, మూల మధుకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షంరెడ్డి, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మహబూబాబాద్: విజయను సన్మానిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్



డోర్నకల్: మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

మహబూబాబాద్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో వివిధ పోటీలలో గెలుపొందిన మహిళా అధికారులకు, ఆర్పీలకు బహుమతులు అందజేయడంతోపాటు కమిషనర్ టి.ప్రసన్నరాణి, డీఎంసీ విజయను పలువురు కౌన్సిలర్లను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, ఆర్పీలు జహీరా, ఉమ పాల్గొన్నారు.

డోర్నకల్: మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు మహిళా కానిస్టేబుళ్లను మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు కోటేశ్వర్‌రావు, నాగేశ్వర్ రావు, క్లబ్ ప్రతినిధులు రమేష్, సుధాకర్, గోపాల్ వర్మ పాల్గొన్నారు.

లీజు కౌలు రూ.60వేలు చెల్లిస్తాం

● ఆర్డీఓ డి.కొమురయ్య

గార్ల: రైల్వేట్రాక్ కింద సీతారామ ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణం కోసం తాత్కాలిక రైల్వేట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు లీజు కౌలు రూ.60వేలు చెల్లిస్తామని మహబూబాబాద్ ఆర్డీఓ డి.కొమురయ్య వెల్లడించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూనిర్వాసితులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2 సంవత్సరాల పాటు తాత్కాలిక రైల్వేట్రాక్ ఏర్పాటు కోసం బుద్దారం, గార్ల పంచాయతీలకు చెందిన రైతులు తమ భూములకు కౌలు ఎకరానికి రూ.2లక్షలు ఇవ్వాలని సమావేశంలో ఆర్డీఓతో కాసేపు వాగ్వాదానికి దిగారు. ఇట్టి భూముల్లో మామిడిచెట్లు కోల్పోతున్న రైతులకు సంవత్సరానికి రూ.4వేలు ఇస్తామని ఆర్డీఓ పేర్కొనడంతో రైతులు ఒప్పుకోలేదు. ఇరువురి మధ్య సమస్య పరిష్కారం కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. రైతుల భూముల లీజు పెంపు, పరిహారం విషయాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, త్వరలో తుది సమావేశంలో వివరాలు వెల్లడిస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు. సమావేశంలో డోర్నకల్, గార్ల తహసీల్దార్లు కె స్వాతిబిందు, రాము, ఎస్సార్‌ఎస్‌పీ ఈఈ శ్రీనివాసాచారి, డీఈ వెంకన్న, హెచ్‌ఓ అనితశ్రీ, ఏఓ రామారావు, డీటీ వీరన్న, ఏఈలు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ కొమురయ్య

గొర్రెలు పంపిణీ చేయాలి

గార్ల: గొల్లకురుమ కులస్తులకు రెండో విడత గొర్రెలు వెంటనే పంపిణీ చేయాలని గొర్రెలమేకల పెంపకందార్ల సంఘం సొసైటీ అధ్యక్షుడు వడ్డేపూడి మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. శ్రీనివాస్, కొండల్ రావు, శ్రీను, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

పెద్దవంగర: మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని ఏఈ అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని అవుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం బిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గార్ల: మండల మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ అబ్దుల్ ఖదీర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ మౌలానా, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రహీం, సహాయ కార్యదర్శిగా షేక్ సత్తార్, కోశాధికారిగా మహ్మద్ హకీం, సహాయ కోశాధికారిగా మీరాపఠాన్‌ను ఎన్నుకున్నారు.

వైద్యశిబిరం

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కురవి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు విరాజిత, సుమతి ఆధ్వర్యంలో మంగళవారం బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం డీసీఎస్ శర్మ, హెచ్‌డబ్ల్యూఓ బి.పద్మ, పీడీ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మంగళవారం ఇనుగుర్తి మండల కేంద్రం, అయ్యగారిపల్లి గ్రామాల్లో హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, నెల్లికుదురు మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, వెంకన్న, సతీష్, చందు, మల్లేశం, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ వర్ధంతి

గార్ల/మరిపెడ: కారల్‌మార్క్స్ వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గార్ల మండల కార్యదర్శి శ్రీనివాసరావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.
కొత్తగూడ: కారల్ మార్క్స్ చిత్రపటానికి స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీశైలం, యాదగిరి యుగెందర్, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం ఆశయ సాధనకు కృషి

మరిపెడ రూరల్: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా కృషి చేసిన మాన్యశ్రీ కాన్షీరాం ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు అన్నారు. మండలం అబ్బాయిపాలెం బీఎస్పీ అధ్యక్షుడు జినక కృష్ణమూర్తి అధ్యక్షతన మాన్యశ్రీ కాన్షిరాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములు, సువార్త, నాగన్న, గురువయ్య, శ్రీను, పూలమ్మ పాల్గొన్నారు.

'పీసా'తోనే ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రభాకర్

కొత్తగూడ: పీసా చట్టం అమలుతోనే ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఐటీడీఏ పరిధి పీసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల పరిధి పీసా మొబిలైసర్‌లతో మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసా పరిధిలో 29 ప్రభుత్వ శాఖల అధికారులు ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి కోసం రోడ్డు రవాణా పనులను ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవద్దని కోరారు. పీసా గ్రామసభ తీర్మానం చేసిన ఎలాంటి అభివృద్ధి పనికైనా వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. రవి, సత్యనారాయణ, సురేందర్, మంగయ్య, రామన్ననాయక్ పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

డోర్నకల్: స్థానిక కస్తూర్బా పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఛత్రునాయక్ తనిఖీ చేశారు. జీసీడీఓ విజయకుమారి, ఎంపీడీఓ అపర్ణ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుతో కలిసి ఛత్రునాయక్ పాఠశాల భవనాన్ని తనిఖీ చేశారు. వాటర్ ట్యాంక్ నుంచి నీరు లీకవడం, భవనం పైభాగంలో అపరిశుభ్రంగా ఉండటంపై ప్రత్యేక అధికారి అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇద్దరు వంట మనుషులు, ఓ స్వీపర్ పోస్టు భర్తీపై ఎంఈఓతో ఫోన్‌లో మాట్లాడారు. బాలికలంతా ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎస్‌కె మున్నీ పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న అధికారులు

వినియోగదారుల హక్కుల దినోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మహబూబాబాద్ వినియోగదారుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ రాజకుమార్ మాట్లాడారు. అనంతరం వినియోగదారుల రక్షణ చట్టం, తూనికల కొలతల శాఖకు సంబంధించిన, గ్యాస్ వినియోగంలో అవలంభించిన విధానాలను గురించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది సత్యనారాయణ, మండలి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, కార్యదర్శి షేక్ జానీ, డిప్యూటీ తహసీల్దార్లు నారాయణరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి .అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో అగ్రిగోల్డ్ సంస్థ రూ.7వేల కోట్లు డిపాజిట్ల రూపంలో డిపాజిట్ దారులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బాధితులు రజిత, సుజాత, వెంకటేశ్వర్లు, రాంబాబు, నాయకులు వెంకన్న, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లీకేజీతోనే నీరు కలుషితం

గార్ల: 'మిషన్ భగీరథ నీటిలో పురుగులు' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మిషన్ భగీరథ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి గార్లలోని ఎరుకల బజార్‌లో తాగునీటిలో పురుగులు వచ్చిన ఇళ్లను సందర్శించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. గార్లలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షిత తాగునీటి పథకం పైప్‌లైన్ లీకేజీ అయ్యి, పైప్‌లైన్ పైనుంచి వెళ్తున్న సైడ్‌కాల్వ లోని నీరు కలిసి లీకేజీ నీటితో కలుషితం అవుతుందన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కురవి: కురవి మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో నేటి(బుధవారం) నుంచి జరగబోయే ఇంటర్మీడియట్ ప్రథమ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తహసీల్దార్ ఇమ్మానీయేల్ తెలిపారు. మంగళవారం పరీక్షల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ అధికారి సురేష్, అధ్యాపకులు కవిత, సుజాత, అనిత, అజయ్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

నెహ్రూసెంటర్: జిల్లాలో పద్మశాలీల అభివృద్ధి, టెక్స్‌టైల్‌పార్క్ ఏర్పాటు కోసం 180 ఎకరాల ప్రభుత్వ భూమిని నామమాత్రపు రేటు ప్రకారం ఇప్పించాలని సంఘం నాయకులు హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

బహుమతుల ప్రదానం

డోర్నకల్: మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారంరోజులపాటు నిర్వహించిన వేడుకలు ముగింపు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటలు, వంటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు పర్వీన్ సుల్తానా, అరుణ, భాగ్యలక్ష్మి, మోనికాజైన్, రాధిక పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నాయకులు

మరిపెడ: రంగారెడ్డి జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులు, యువ మోర్చా నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని పిలుపునివ్వగా ముందస్తుగా పోలీసులు జిల్లా ఉపాధ్యక్షులు భూక్య కాంతమ్మ, మండల బీజేపీ అధ్యక్షుడు బింగి రమేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు భూక్య లింగంనాయక్, తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కురవి: సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్ ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్షల సామగ్రిని మంగళవారం హెచ్‌ఎం ఇస్లావత్ లచ్చిరాం నాయక్ పంపిణీ చేశారు. తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్క(యూఎస్‌ఏ) సహకారంతో స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

బయ్యారం: మండలంలోని కోయగూడెం-కిష్టాపురం గ్రామాల నడుమ ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని కోయగూడెం సర్పంచ్ పూనెం మణెమ్మ మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర అకడమిక్ మానటరింగ్ టీం కోఆర్డినేటర్ శంకరయ్య, ఎస్‌ఆర్‌జీ అనిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను మంగళవారం సందర్శించారు.

ఆరోగ్య మహిళా క్యాంప్ ప్రారంభం

దంతాలపల్లి: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు చైతన్య, స్పందన మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలో ఆరోగ్య మహిళల కోసం ఎన్నిక చేసిన ఐదు వైద్యశాలలో దంతాలపల్లి వైద్యశాల ఉండటం చాలా సంతోషం అన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

గార్ల: రానున్న ఎన్నికల నాటికల్లా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి రామచందర్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం గార్ల పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్టారెడ్డి, రాజునాయక్, ప్రేమ్‌చంద్‌వ్యాస్, సత్యం, అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంత గర్భిణిలు, బాలింతలు, చిన్న పిల్లలకు ప్రభుత్వాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌసియా కోరారు. మంగళవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, ఉపసర్పంచ్ రాజు, అంగన్‌వాడీ టీచర్స్ పద్మ, సుజాత, ఇందిరమ్మ, మంజుల పాల్గొన్నారు.

పార్టీ కుటుంబాలకు అండగా ఉంటాం

తొర్రూరు: బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తొర్రూరు అభివృద్ధి కమిటీ చైర్మన్ సోమేశ్వర్‌రావు తల్లి సుదేష్ణదేవి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భౌతిక కాయాన్ని మంత్రి సందర్శించారు.

మార్కెట్ సందర్శన

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను మంగళవారం భూపాలపల్లి జిల్లా పరకాల మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, సభ్యులు సందర్శించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, జిల్లా కార్యదర్శి సూరయ్య, మండల అధ్యక్షుడు పిచ్చయ్య పాల్గొన్నారు.

బాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: ఆత్మహత్య చేసుకున్న జీపీ కార్మికుడు కొంగరి బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, సూర్యం మంగళవారం అన్నారు.

గ్రామపంచాయతీగా ప్రకటించాలి

గార్ల: మండలంలోని పాతపోచారం గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని మంగళవారం ఎంపీడీఓ రవీందర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. పాతపోచారం గ్రామస్తులు రేషన్‌బియ్యం కోసం 2కిలోమీటర్లు కోట్యానాయక్‌తండాకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు.

క్రైం కార్నర్..

ఇంట్లో నగల చోరీ

నెల్లికుదురు: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న నగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కనకం సోమయ్య కుటుంబ సభ్యులు అదే రోజు ఉదయం 4గంటలకు వేములవాడకు వెళ్లారు. ఇంట్లో ఉన్న కూతురు అల్లుడు ఉదయం తొమ్మిది గంటలకు వరంగల్‌కు వెళ్లారు. తిరిగి రాత్రి 9గంటలకు ఇంటికి వచ్చిన కూతురు అల్లుడుకి ఇల్లు తాళం పగుల గొట్టి ఉన్నట్లు గమనించి వెంటనే వేములవాడలో ఉన్న సోమయ్యకు తెలిపారు. 5తులాల బంగారం, 40 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వేములవాడ నుంచి వచ్చిన సోమయ్య మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు

గూడూరు: మండలంలోని ఓ టీవీ రిపోర్టర్‌పై పాత కక్షలతో దాడి చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ మంగళవారం తెలిపారు. మండలంలోని గుండెంగ గ్రామ పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కోటేశ్ పెట్రోల్ పంపు వద్ద పెట్రోల్ పోయించుకుంటున్న టీవీ రిపోర్టర్ బోడ రాజుపై పాత కక్షలతో దాడి చేశాడు. కాగా రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామానికి చెందిన పులసాని వంశీరెడ్డి అనే వ్యక్తి అదృశ్యమైనట్లు సీరోలు ఎస్సై నరేష్ కుమార్ మంగళవారం తెలిపారు. కాంపల్లి గ్రామానికి చెందిన వంశీరెడ్డి అనే వ్యక్తి గత మూడు రోజులుగా కనిపించకపోవడంతో వంశీ తండ్రి సురేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

స్వయంపరిపాలన దినోత్సవం



తొర్రూరు: ప్రాథమిక పాఠశాలలో..



తొర్రూరు రూరల్: అరిపిరాలలో..

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలనా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుంటుక యాకయ్య, ఉపాధ్యాయులు సోమేశ్వర్, హైమావతి, విమలాదేవి, రోజారాణి, రేణుక, స్వప్నలు పాల్గొన్నారు.
తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధి 19వార్డులో ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించాడు. కౌన్సిలర్లు గోపిరత్నం, స్వప్న, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.
కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి ప్రారంభించారు.
నెహ్రూసెంటర్: మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మంగళవారం సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో త్రివేణి, బిల్ కలెక్టర్ నాగేశ్వర్‌రావు, దివ్య, రత్నకుమారి, ఏఎన్‌ఎం అశ్విని, తదితరులు పాల్గొన్నారు.
చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీష మంగీలాల్, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్ రెడ్డి. మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, వైద్యులు పాల్గొన్నారు.